క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న ఎస్సై గరగారావు

సామర్లకోట: ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు అన్నారు. బుధవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లను దాటే సమయంలో రెండు వైపులా వాహనాలను గమనించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు ఉంటాయన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించగా ఏఎస్సై టీవీ రత్నం, ఫిజికల్ డైరెక్టర్ తాళ్లూరి వైకుంఠం, ఉపాధ్యాయులు వి.రాజు, జి.గోవిందు, ఏఎల్‌వీ కుమారి, కె.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పీఓల శిక్షణ



శిక్షణ పూర్తయిన పీఓలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో డ్వామాలోని పీఓలకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఉపాధి హామీ పథకంలో పనుల ప్రాధాన్యం, మునగ మొక్కల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. విస్తరణ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ మూడు రోజుల పాటు నేర్చుకున్న అంశాలపై ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, పి.శ్రీనివాసరావు, నిహారిక, ప్రసాద్, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మూడో రోజు శిక్షణ జరిగింది. అనంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఆత్మగౌరవ సభ విజయవంతానికి పిలుపు

సామర్లకోట: వచ్చే నెల 1న పెద్దాపురం అంబేడ్కర్ భవనంలో జరిగే దగా పడిన దళితుల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని శ్రీకాంత్ స్పీచ్‌థెరపీ ఇనిస్టిట్యూట్ ఫర్ హియరింగ్ హ్యాండీక్యాప్డ్ అండ్ హెల్పర్ అసోసియేషన్ ట్రస్టు ఫౌండర్, చైర్మన్ బోడపాటి కాంతం అన్నారు. స్థానికంగా దళిత ప్రజా చైతన్యం ఆధ్వర్యంలో ఈ సభ గురించి ప్రచారం చేశారు. సభ్యులు బోడపాటి నాగశ్రీవేణి, ఎం.సుమత, బి.మరియ, రమాదేవి, చిన్నా, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ మరింత పెంచాలి

కొత్తపల్లి: జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో పాల సేకరణను మరింత పెంచాలని పశు వైద్యాధికారి సందీప్ రెడ్డి అన్నారు. మండలంలోని రమణక్కపేటలో ఉన్న జగనన్న పాల వెల్లువ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. రైతులకు పాల వెల్లువపై మరింత అవగాహన కల్పించాలని, గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో గ్రామాల్లోని పాల కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కేంద్రాలకు పాలు పోసే రైతులకు సబ్సిడీపై దాణా అందిస్తున్నామని, పశువులను కొనుగోలు చేసేందుకు రుణాలు కూడా మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి పాడిరైతు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నకిలీ వీఆర్వో పేరుతో ధ్రువపత్రాలు



నకిలీ వీఆర్వో అప్పారావు ఇచ్చిన ధ్రువీకరణ పత్రం

కరప: ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని వారి నుంచి సొమ్ములు కాజేసి, ధ్రువ పత్రాలు ఇచ్చేస్తున్నాడు నకిలీ వీఆర్వో. అరట్లకట్ట వీఆర్వోగా బి.దుర్గాదేవి పనిచేస్తున్నారు. అయితే ఎం.అప్పారావు అనే వ్యక్తి తానే వీఆర్వోనంటూ ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు ఇచ్చేస్తూ సొమ్ములు వసూలు చేస్తున్నాడు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామానికి చెందిన బొండాడ సుబ్బాయ్యమ్మ తన పట్టా భూమిపై బ్యాంకు రుణం పొందేందుకు మొదట నకిలీ వీఆర్వో అప్పారావు నుంచి ధ్రువీకరణ పత్రం పొందారు. అనంతరం ఆ స్థలం సంబంధిత పత్రాలపై పంచాయతీ కార్యదర్శి వై.రాంజీ సంతకం అవసరం అవడంతో అక్కడకు వెళ్లి ఆయనకు వీఆర్వో ధ్రువపత్రం చూపింది. ఆ పత్రాన్ని పరిశీలించిన కార్యదర్శి అసలైన వీఆర్వో దుర్గాదేవికి దానిని అందజేసి నకిలీ ధ్రువపత్రం వచ్చింది చూసుకోండని అందజేశారు. కాగా ఈ ఉదంతంపై కార్యదర్శి కానీ, వీఆర్వో కానీ పై అధికారులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. అలాగే ఈ విషయమై తనకు ఏ సమాచారమూ లేదని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు తెలిపారు. విచారణ జరిపి బాధ్యు లపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఓటర్ల లెక్క తేలింది



ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ, ఆర్ఓ రామారావు

- పూర్తయిన ఇంటింటి సర్వే
- నియోజకవర్గంలో 2,10,209 మంది ఓటర్లు

పెద్దాపురం: ఓటు... వజ్రాయుధం. ప్రజాస్వామ్యంలో తమకు నచ్చిన, ఉత్తమ నాయకులను ఎన్నుకునే అస్త్రం. అందుకే పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు అవశ్యం. దీనికోసం ఏటా కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఓటర్ల జాబితాపై ప్రత్యేక సమగ్ర సవరణ 2024 పేరిట ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. గత నెల జులై 21న ప్రారంభమైన ఈ సర్వే ఈ నెల 21తో ముగిసింది. బూత్ స్థాయి అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు గ్రామాల్లో నేరుగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వే చేసి పూర్తి వివరాలను సేకరించారు. పెద్దాపురం నియోజవకర్గంలో మొత్తం 2,10,209 మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చారు. ఆర్డీఓ జేఎస్ రామారావు నేతృత్వంలో నియోజకవర్గంలో 98 శాతం సర్వేను పూర్తి చేశారు.

అధికారుల పర్యవేక్షణ

పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరించింది. గ్రామాల్లో ఇంటింటా సర్వేను రెవెన్యూ అధికారి జేఎస్ రామారావు పర్యవేక్షించారు. ఎక్కువ ఓట్లు లేదా అడ్రస్‌లలో మార్పులున్న ఓటర్ల వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేస్తూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధుల సమావేశాలు నిర్వహించి ఓటు నమోదుకు సహకరించాలని కోరారు. తద్వారా పక్కాగా సర్వే చేశారు. అర్హత ఉండి 2024 జనవరి ఒకటో తేదీకి 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్ల జాబితాలో చేర్చారు. వీరి నుంచి ఫారం-6తో పాటు వయసు ధ్రువీకరణ పత్రాన్ని తీసుకున్నారు. అలాగే తప్పుల సవరణ, మృతులు, నకిలీ ఓట్లను తొలగించారు. వయసులో వ్యత్యాసం, అడ్రస్ మార్పు, వ్యక్తిగత వివరాల్లో మార్పులు, చేర్పులు ఉంటే సవరించారు. ఒకే ఇంట్లో పదికి మించి ఓట్లు ఉంటే వాటిని గుర్తించి ఒక్కటికి రెండు సార్లు తనిఖీ చేశారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే



కేవలం బీఎల్‌ఓలతో ఓటర్ల ఇంటింటా సర్వేను పూర్తి చేశాం. 2024 జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తున్నాం. సర్వే పారదర్శకంగా నిర్వహించాం. ఓటును తొలగించాల్సి వస్తే సంబంధిత ఓటరుకు నోటీసులు ఇచ్చి తరువాత తదుపరి చర్యలు తీసుకోవాలని బీఎల్‌ఓలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి సర్వేను చేయించాం.

– జేఎస్ రామారావు, ఆర్డీఓ, ఆర్ఓ, పెద్దాపురం

నియోజకవర్గంలో ఓటర్లు, సర్వే వివరాలు

మండలం	మొత్తం ఓట్లు	ఇంట్లోలేని వారు	ఇళ్లు మారినవి	మృతులు	డబుల్ ఎంట్రీ
పెద్దాపురం రూరల్	58,818	166	158	804	76
పెద్దాపురం అర్బన్	40,315	833	464	1084	187
సామర్లకోట రూరల్	68,768	247	469	1904	164
సామర్లకోట అర్బన్	42,308	68	177	567	145

కృషి, పట్టుదలతో విజయం



తర్లంపూడి చైతన్యను అభినందిస్తున్న దవులూరి దొరబాబు తదితరులు

సామర్లకోట: కృషి, పట్టుదలతో విజయం తథ్యమని, దీనికి సివిల్స్ విజేత తర్లంపూడి చైతన్య నిదర్శనమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సామర్లకోటకు చెందిన తర్లంపూడి చైతన్య గ్రూప్-1 మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించి ఎంపీడీఓగా ఎంపికైన విషయం విదితమే. ఈ మేరకు దొరబాబు బుధవారం చైతన్య స్వగృహానికి వెళ్లి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైతన్య తాతయ్య సత్తిబాబు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పట్టణ ప్రజలకు సేవలందించారన్నారు. అదే విధంగా తండ్రి కమల్‌రాజ్ వైఎస్సార్ సీపీ పట్టణ సహాయ కార్యదర్శిగా ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్నారన్నారు. తమ పార్టీకి చెందిన కమల్‌రాజ్ కుమారుడు గ్రూప్-1లో విజయం సాధించి ఎంపీడీఓగా ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రూప్‌లో ఎంపీడీఓగా ఆరు నెలల పాటు శిక్షణ పొందుతూ సివిల్ శిక్షణపై దృష్టి సారించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. అనంతరం తర్లంపూడి చైతన్యను సత్కరించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, బీజేపీ నాయకులు సుంకవిల్లి బాపిరాజు, యార్లగడ్డ అక్కిరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కొత్తపల్లి: గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి సాక రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యలయం ఎదురుగా బుధవారం పార్టీ ఆధ్వర్యంలో పలువురితో కలసి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సమస్య పరిష్కరించే వరకు తన వంతు పోరాడతాన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే దుష్ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఎలిశెట్టి అమృత, నాయకుడు నరేష్

సామర్లకోట: పి.వేమవరంలో ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన, టీడీపీ మద్దతుతో పోటీ చేసిన వారు మాత్రమే టీడీపీలో చేరారని జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిశెట్టి అమృత, వైఎస్సార్ సీపీ సీనియర్ జిల్లా నాయకుడు ఎలిశెట్టి నరేష్ స్పష్టం చేశారు. బుధవారం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే చినరాజప్ప సమక్షంలో కొంత మంది టీడీపీలో చేరితే వారు వైఎస్సార్ సీపీకి చెందిన వారని ప్రజలను నమ్మించడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎంత రెచ్చగొట్టినా శాంతియుతంగా ఉండాలని నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు చెప్పారని, అందుకు అనుగుణంగా నడుచుకుంటున్నామని వారు తెలిపారు. ఇటీవల తనపై జనసేనకు చెందిన కార్యకర్తలు దాడి చేయడంతో ఓ కేసు, వారే ప్రభుత్వాధికారిపై దాడి చేయడంతో మరో కేసు, అలాగే పంచాయతీ కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో అధికారులు ఒక కేసును పెట్టారని ఎలిశెట్టి నరేష్ తెలిపారు. ఈ విషయాలను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బండారు సత్యనారాయణమూర్తి గ్రహించాలన్నారు. ఇవి రాజకీయ కేసులు కాదని తెలుసుకోవాలన్నారు. పంచాయతీ, జిల్లా, మండల పరిషత్తుల నిధులతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేస్తున్నామని, ఇవి ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో సర్పంచ్ ఎలిశెట్టి నూకరత్నం, ఎంపీటీసీ సభ్యుడు కేశవరపు వీరమణి, మాజీ సర్పంచ్ ఎలిశెట్టి భీమన్నదొర, ఉపసర్పంచ్ అత్తిలి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సాయి ప్రసాద్

పెద్దాపురం: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆదేశించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో జరుగుతున్న రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, కోఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు చదువుకోవాలి

- ఇన్‌చార్జి ఎంఈఓ వేణుగోపాల్
- స్కూల నమోదు నిష్పత్తి పరిశీలన



పదో తరగతి ఉత్తీర్ణులు కాని విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పిస్తున్న విద్యాశాఖ అధికారులు

కొత్తపల్లి: ఐదేళ్ల నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలందరూ పాఠశాలలో విద్యనభ్యసించాలని మండల ఇంచార్జి విద్యాశాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. స్కూల నమోదు నిష్పత్తి ప్రక్రియలో భాగంగా మండలంలో ఉన్న పలు ప్రైవేటు పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. స్థానికంగా ఉన్న వీవీఎస్, ఎండపల్లి, కొండెవరంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. ఐదేళ్లు దాటి ఉన్న పిల్లలను కూడా ఎల్‌కేజీలోనే ఉంచడంతో వారిని వయస్సుకు తగ్గ తరగతుల్లో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో అధిక శాతం మంది విద్యార్థులు వయసుకు తగ్గ తరగతులు చదవని 200 మంది పిల్లలను గుర్తించి వారిని ఉన్నత తరగతులకు మార్చాలంటూ ఆదేశించారు. గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. యండపల్లిలో ఇటీవల పదో తరగతిలో ఉత్తీర్ణులు కాని ఐదుగురిని గుర్తించి వారిని తిరిగి పదో తరగతిలో చేర్పించారు. ముఖ్యంగా పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రులపై ఆధారపడి ఉందని వారికి బడి ముద్దు- పని వద్దు అనే నినాదాన్ని తెలియజేయాలన్నారు. ఆయన వెంట విద్యాశాఖ సిబ్బంది ఉన్నారు.

పూడిక తీశారు.. తొలగింపు మరిచారు



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో తొలగించని కాలువ పూడిక

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి వెంబడి ఉన్న డ్రైన్‌లో పూడికను నెల రోజుల కిందట రైల్వే అధికారులు తీయించారు. తీసిన పూడికను అక్కడి గట్టుపై వేశారు. వర్షాలు పడుతుండడంతో రైల్వే క్వార్టర్స్‌తో పాటు రైల్వే ట్రాక్‌పైకి నీరు వస్తుండడంతో మున్సిపాలిటీ చేయాల్సిన పనిని రైల్వే అధికారులు చేయించారు. అయితే పూడిక తీసి నెల రోజులు గడిచినా దానిని తొలగించకపోవడంతో తిరిగి డ్రైన్‌లోకి చేరే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. దీనిపై రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్‌ను వివరణ కోరగా డ్రైన్‌లో తొలగించిన పూడికను మున్సిపల్ అధికారులు తొలగిస్తామని చెప్పారన్నారు. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి పూడిక తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

టంగుటూరి సేవలు ఆదర్శం



పెద్దాపురంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్



సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో..



టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

పెద్దాపురం: టంగుటూరి ప్రకాశం పంతులు అందించిన సేవలు ఆదర్శనీయమని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో టంగుటూరి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి, పట్టుదల, నిస్వార్థ ప్రజా సేవకుడిగా టంగుటూరి ఖ్యాతికెక్కారన్నారు. తొలుత ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓ వెంకటలక్ష్మి, డీటీ భానుకుమార్ పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో టంగుటూరి జయంతిని నిర్వహించారు. కార్యాలయ పరిపాలనాధికారి సత్యనారాయణ మూర్తి, సీనియర్ సహాయకుడు జగన్నాథం పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి తదితరులు నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్ కానేటి రాజేశ్వరీ, కమిషనర్ జె.రామారావు పాల్గొన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీఓ డి.శ్రీలలిత ఆధ్వర్యంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రకాశం పంతులు జీవిత విశేషాలను ఉపాధ్యాయులు వివరించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం వి.రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండలంలో..

కొత్తపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రముఖ స్వాతంత్ర్యయోధులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి తహసీల్దారు ప్రసాద్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్, ఆర్‌ఐ పొన్నాల, కార్యాలయం సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మ్యూజియం అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కొడా వీసీ సుబ్బారావు తదితరులు

కాకినాడ రూరల్: సూర్యారావుపేట బీచ్‌లో గుడా యుద్ధ విమాన మ్యూజియంలో అభివృద్ధి పనులను కొడా వీసీ సుబ్బారావు సిబ్బందితో కలిసి బుధవారం సాయంత్రం పరిశీలించారు. యుద్ధ విమానం వద్ద సందర్శకులు లోపలికి వెళ్లి వచ్చేలా చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు పార్కు అభివృద్ధి పనులు పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులను పనులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. యుద్ధ విమానం మ్యూజియం వద్ద ఏపీ టూరిజం డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఫ్లోరింగ్ పనులు, ఇంటర్ ప్రిటేషన్ సెంటర్ పనులు జాప్యంతో ఆ ప్రభావం యుద్ధ విమాన మ్యూజియంపై పడుతుందని గుర్తించి రద్దు చేసి, కొడా ద్వారా పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాలు, పిల్లలకు ఆట పరికరాలు, దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు తదితర 13 రకాల పనులను రూ.2.32 కోట్లతో చేపడుతున్నామన్నారు. అక్టోబరు నాటికి యుద్ధ విమాన మ్యూజియం ప్రారంభించేలా పనులు వేగవంతం చేశామన్నారు.

పాఠశాలను పరిశీలించిన కలెక్టర్



సామర్లకోట జగ్గమ్మగారిపేటలో పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

సామర్లకోట: స్థానిక జగ్గమ్మగారిపేటలో అన్నా క్యాంటిన్‌లో ఉంటున్న మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలను కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం పరిశీలించారు. ఇటీవల సామర్లకోటలో నిర్వహించిన స్పందనలో ఆ వార్డు కౌన్సిలర్ పితాని కృష్ణ పాఠశాలను మార్పు చేయాలని ఫిర్యాదు చేశారు. దాంతో పాఠశాలను ఆమె పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు దూరంగా ఉండటంతో ఇబ్బందిగా ఎదురవుతుందని కలెక్టర్ దృష్టికి కౌన్సిలర్ తీసుకు వెళ్లారు. దీంతో కలెక్టర్ స్పందించి విద్యార్థులు ఉంటున్న ఏరియా సమీపానికి ఎలిమెంటరీ పాఠశాల, ఉన్నత పాఠశాల వివరాలను తనకు మ్యాప్ ద్వారా అందజేయాలని ఎంఈఓలు శివరామకృష్ణయ్య, టి.పుల్లయ్యకు సూచించారు. వార్డులో మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ స్థలాన్ని విద్యాశాఖకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని కమిషనర్ జె.రామారావు తెలిపారు. దీనిపై తగు నిర్ణయం తీసుకొంటామని కలెక్టర్ తెలిపారు. ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9న క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబరు 9న జిల్లాస్థాయి అథ్లెట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. సంఘ అధ్యక్షుడు కె.స్వర్ణరాజు పర్యవేక్షణలో స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉదయం 8 గంటలకు ఎంపికలు ప్రారంభమౌతాయన్నారు. అండర్-14, 16, 18, 20 విభాగాలలో బాలురు, బాలికల అంశాల్లో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, పుట్టినతేదీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని ఆయన కోరారు.

కెరియర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

బాలాజీచెరువు: ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కెరియర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను బుధవారం సాయంత్రం విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి ప్రారంభించారు. వర్సిటీ అంబేద్కర్ సెంట్రల్ గ్రంథాలయం మూడో అంతస్తులో 300 కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన సెంటర్ ప్రారంభించి పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా సెంట్రలైజ్డ్ ఏసీ ల్యాబ్‌గా ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రసాదరాజు, రెక్టార్ కేవీ రమణ, నన్నయ్య వీసీ పద్మరాజు, రిజిస్ట్రార్ సుమలత పాల్గొన్నారు.

పెద్దాపురప్పాడు హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ పురస్కారం



వివిధ క్రీడలలో పాల్గొన్న క్రీడాకారులతో పెద్దాపురప్పాడు హైస్కూలు ఉపాధ్యాయులు (ఫైల్)

కరప: ప్రస్తుత విద్యా సంవత్సరానికి పెద్దాపురప్పాడు బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డు లభించినట్టు పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈ నెల 29న జరిగే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని 2020-21 నుంచి ఈ పురస్కారాలు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ అవార్డును భారతదేశంలో మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇస్తున్నట్టు తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరానికి తమ పాఠశాల 167 పాయింట్లతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలచి, అవార్డుకు ఎంపికైందని హెచ్‌ఎం తెలిపారు. పెద్దాపురప్పాడు హైస్కూలుకు చెందిన 31 మంది క్రీడాకారులు సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ అండర్-14, 17 బాల, బాలికలు, హ్యాండ్‌బాల్, స్విమింగ్, రైఫిల్ షూటింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపారని, అందువల్ల ఈ అవార్డు లభించినట్టు పాఠశాల పీడీ బీవీవీఎస్ ప్రసాద్ తెలిపారు. గతంలో కూడా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2021-22లో 172 పాయింట్లతో పెద్దాపురప్పాడు హైస్కూలు ప్రథమస్థానం సాధించిందని పీడీ తెలిపారు.